క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

పెదపాడు : మండలంలోని ఏపూరు ప్లేట్లరు వద్ద వేంచేసియున్న శ్రీ సీతారామ దాసాంజనేయస్వామి వారి 75వ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం హోమాలు నిర్వహించారు. ఉదయం మహాశక్తివంతమైన ఏకాదశ మన్యసూక్తంతో ఆంజనేయస్వామి వారికి మహాయజ్ఞం సాయంత్రం కోలాట నృత్య ప్రదర్శన జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై గ్రామోత్సం నిర్వహించారు. ఆదివారం ఉదయం మహా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు చెప్పారు.

నేడు దోసపాడుకు డివిజనల్ కమాండర్ దంపతులు రాక

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజ్యం లత దంపతులు ఆదివారం ఉదయం దోసపాడు సాల్వేషన్ ఆర్మీ చర్చికి విచ్చేస్తున్నారని చర్చి కోర్ ఆఫీసర్ మేజర్ జోసెఫ్ మేజర్ కటాక్షం అన్నారు. దోసపాడు గ్రామానికి చెందిన మేజర్ లత సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజన్ డిడి డబ్ల్యూఎంగా నియమితులై స్వగ్రామానికి తొలిసారిగా విచ్చేస్తున్న నేపథ్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి చర్చి వరకు మేళ తాళాలతో ఊరేగింపుగా భారీ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలకటం జరుగుతుందనీ సంఘ పెద్దలు కల్యాణ్‌రావు, వెంకట్రావు, ఆదాము రాజేష్, జ్ఞాన సుందరం, పద్మరాజు కుమార్ అన్నారు.

ఘనంగా స్వామివారి గ్రామోత్సవం



భీమడోలులో ఊరేగుతున్న శ్రీవీరాంజనేయ స్వామి వారు

భీమడోలు: హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం భీమడోలులోని వీరాంజనేయ స్వామికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా ఇక్కడ హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు కంచారపు తిరుమల సంగయ్యాచార్యులు ఆధ్వర్యంలో భీమడోలు సంతమార్కెట్ వద్ద వీరాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాల నడుమ భీమడోలు పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఆయుష్ హాస్పిటల్‌కు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

ఏలూరు టౌన్ : స్థానిక అశోక్‌నగర్‌లోని ఆయుష్ హాస్పిటల్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ (ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు సాధించిందని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్స్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. హాస్పిటల్‌లోని సుమారు 651 అంశాలపై ఎన్‌ఏబీహెచ్ బృందం పరిశీలించిన అనంతరం అక్రిడిటేషన్ ఇచ్చారని చెప్పారు. దేశంలో సుమారుగా 1550 హాస్పిటల్స్‌కు మాత్రమే ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు ఉండగా ఏలూరు లాంటి టైర్–2 నగరంలో ఈ గుర్తింపు రావటం తమ ప్రతిభకు గుర్తింపు అన్నారు. హాస్పిటల్స్ వైస్ చైర్మన్ పీఎస్ శ్రీనివాస్ చౌదరి, ఆయుష్ వైద్యులు దశరథ్ బొప్పన, అక్కిన శ్రీరామ్ మాట్లాడారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేడా జయలక్ష్మి పాల్గొన్నారు.

ఐక్యతతోనే సంఘాల అభివృద్ధి

దెందులూరు : ఐక్యత ప్రణాళికతోనే మహిళా సంఘాల అభివృద్ధి బలోపేతమవుతాయని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ డీడీ డబ్ల్యూఎం మేజర్ లత అన్నారు. శనివారం ఆమెను సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్ కోర్ ట్రెజరర్ మాజీ సర్పంచ్ లీనా ప్రశాంతి, సెంట్రల్ కోర్ సభ్యు లు కలిశారు. సెంట్రల్ కోర్‌లో గృహ సమితి సభ్యులు సంఘాల ప్రణాళిక, గృహ సందర్శన, ర్యాలీలు, సభలు సమావేశాలను వివరించారు.

మానవత్వంతో కూడిన చికిత్స అందించాలి

ఏలూరు (టూటౌన్): ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ వంశి కృష్ణ, డాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవాన్ని నేషనల్ స్కిజోఫ్రెనియా ఫౌండేషన్ స్థాపించిందన్నారు. 2025 సంవత్సరానికి స్కిజోఫ్రెనియా చికిత్స, పరిశోధనలో సరికొత్త పద్ధతులను ఉపయోగించి, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించే ప్రయత్నాలను తెలిజేస్తోందని వివరించారు.

కియోస్క్ సేవలకు మంగళం

- రైతుసేవా కేంద్రాల్లో మూలనపడిన కియోస్క్‌లు
- నిలిచిన ఎరువులు, పురుగు మందుల విక్రయాలు
- సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్దకు రైతుల పరుగులు



నిరుపయోగంగా పడి ఉన్న కియోస్క్

దెందులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా, మరికొన్నింటిని పేర్లు మార్చి వేస్తుంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం సేవలను సైతం ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడగులు వేస్తోంది. ముఖ్యంగా రైతులకు వారి ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోపాటు వారికి అవసరమైన సేవలు అందజేసేందుకు జగన్ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రైతులకు తమకు కావాల్సిన వ్యవసాయ సేవలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలను ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం కియోస్క్‌లు ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, యంత్ర పరికరాలు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందేందుకు గత ప్రభుత్వం కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ యంత్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలను ఆన్‌లైన్‌లోనే ముందుగానే నమోదు చేసుకునే వారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియోల రూపంలో తెలుసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ సర్వర్లు పనిచేయకపోవడం తోపాటు సచివాలయ సేవలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో 107 ఆర్‌బీకేలు

దెందులూరు నియోజకవర్గంలోని మండలాల పరిధిలో గత ప్రభుత్వం 107 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఆర్‌బీకేల్లో 107 కియోస్క్ యంత్ర పరికరాలను రైతులకు సేవలందించేలా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆర్‌బీకేల్లో ఉన్న ఈ పరికరాలు కేవలం ఎరువుల అమ్మకాలకు మాత్రమే ఉపయోగిస్తూ మిగిలిన సేవలకు దూరంగా ఉంటున్నాయి. అయితే అధికారులు మాత్రం వాటిని వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

పీఎంఏఐడీ యాప్ ఏర్పాటు

రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరాల స్థానంలో పీఎంఏఐడీ యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనివల్ల అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని, ఆ యంత్రాల్లో గతంలో మాదిరిగానే పూర్తిస్థాయిలో సేవలందించాలని రైతులు కోరుతున్నారు.

కియోస్క్ సేవలు కొనసాగించాలి



రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్ర సేవలు కొనసాగించాలి. ఎరువులు, పురుగు మందులు నమోదుతో పాటు మార్కెటింగ్ సౌకర్యాలను తెలుసుకునేందుకు కియోస్క్ యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి.

– అంగదాల వెంకటేశ్వరరావు, రైతు ఎంపీటీసీ, మేధినరావుపాలెం

సేవలు కొనసాగుతున్నాయి



ఆర్‌బీకేల్లో ఉన్న కియోస్క్ సేవలు వినియోగిస్తున్నాం. రైతులకు అన్ని రకాల సేవలు అందజేస్తున్నాం. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవలందించేలా కృషి చేస్తున్నాం.

– వై సుబ్బారావు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ

ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం సరికాదు



ఎండీయూ వాహనదారులకు మద్దతు పలికిన పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, నాయకులు

దెందులూరు: కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాల డ్రైవర్లను తొలగించడం అత్యంత బాధాకరమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. శనివారం శ్రీరామవరంలో రేషన్ వాహనాల డ్రైవర్లను నాని కలిశారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు దెందులూరు మండల పార్టీ నాయకులు నిట్టా గంగరాజు కామిరెడ్డి నాని మద్దతు ప్రకటించారు. డ్రైవర్లు హెల్పర్లు వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు జీవన విధానం భద్రత భవిష్యత్తు వీటిని ఏమాత్రం పరిగణలో తీసుకోకుండా కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా తొలగించడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే రేషన్ సరుకులను ఇంటి వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందేలా ఏర్పాటు చేస్తే, నేడు ఆ సేవలను శాశ్వతంగా తొలగించడమే కాకుండా డ్రైవర్లు హెల్పర్లు వారి కుటుంబాల్లో తీరని ఆవేదనను మిగిలిచారని దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని కామిరెడ్డి నాని, నిట్టా గంగరాజు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న వైద్య సిబ్బంది



చేబ్రోలులో ఎంపీడీవో రాజ్‌మనోజు యోగా చేయిస్తున్న దృశ్యం

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి శ్రామికులకు యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. తమ వైద్యశాల సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలతో శ్రామికులకు యోగాలో ప్రతిరోజు ఉదయం సెషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ యోగ సాధన పై ఆధార పడి ఉందన్నారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు

ఉంగుటూరు: యోగాతో బహుళ ప్రయోజనాలు చేకూరతాయని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. శనివారం చేబ్రోలు పంచాయితీ ఆఫీసు వద్ద యోగా నిర్వహించారు. ఎంపిడివో మనోజు మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయాలని సూచించారు. యోగా శిక్షకులు యెలిశెట్టి కిషోర్ అభ్యాసకులచే యోగాసనాలు చేయించారు. ఈకార్యక్రమంలో సర్పంచి రందే లక్ష్మీసునీత పంచాయితీ కార్యలయం సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

గుండుగొలనులో కాలువ పనుల పరిశీలన



గుండుగొలను వద్ద కాల్వ పూడిక తీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: గోదావరి కాల్వ పూడిత తీత ద్వారా సాగునీరు, తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను ఇరిగేషన్ కాల్వ వద్ద ప్రారంభించిన కాల్వ పూడిక తీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. పీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ సిబ్బంది నుంచి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ పూడిక తీయకపోవడంతో దాళ్వాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. దీనితో కాలువ పూడిక తీసి, గట్టు పటిష్టం చేయడం జరుగుతుందన్నారు. దీని వల్ల సాగునీరు, తాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. గుండుగొలను నుంచి ఆశ్రం ఆసుపత్రి వరకు 12 కిలోమీటర్ల మేర చేపట్టిన పూడిక తీత పనులు జూన్ 10వ తేదీ లోగా పూర్తి చేస్తారన్నారు. పూడిక తీత పనులను నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, దెందులూరు డీసీ పర్వతనేని రంగారావు, గుండుగొలను, పోతునూరు డీసీ పరిధిలోని సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత వార్డెన్లదే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎం.ముక్కంటి

భీమడోలు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్లపై ఉందని ఆ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం. ముక్కంటి అన్నారు. పూళ్ల బాలికల వసతి గృహం వద్ద శనివారం భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ద్వారకాతిరుమల మండలాల పరిధిలోని 10 బాలుర, బాలికల వసతి గృహాల వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూవోలతో హస్టల్‌లో అడ్మిషన్లు పెంపుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ దాయం సుజాత అధ్యక్షత వహించారు. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేడీ ఎం.ముక్కంటి వసతి గృహాల వారీగా వార్డెన్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లపై లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలపై ఆయన వారితో సమీక్షించారు. జేడీ సంక్షేమ వార్డెన్లకు పలు సూచనలందజేశారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రతి వసతి గృహంలో విధిగా 100 మంది విద్యార్థులను చేర్పించాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని, అందులకు వెల్ఫేర్ అసిస్టెంట్ల సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు వసతి గృహాల్లో సమకూరుతున్న సౌకర్యాలు, వసతులు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. హస్టల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్య మనందరిపై ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత, పోష్టికాహారం, విద్యార్థుల పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, ఇతర విషయాలను వారికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని 52 వసతి గృహాలను రూ.5.72కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. జూన్ మొదటి వారంలో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యకమంలో ఎఎస్‌డబ్ల్యూవో ఎస్.ఏ. మంగతాయరు, వార్డెన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి



వైఎంహెచ్ఏ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): తుంపాల మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేశారు. ఈ ఘటనకు బాధులైన గెద్దం సంతోష్ తల్లిదండ్రులు లుకరాజు, బాప్సిబాలను అరెస్టు చేయాలని కోరుతూ శనివారం ఏలూరు వన్‌టౌన్ ఏరియా రైతు బజార్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా ఎల్ఐసీ ఆఫీస్, వైఎంహెచ్ఏ హాల్ పక్కనున్న లాగుడు బండ్ల ఆఫీసు వద్దకు, నాలుగు రోడ్ల కలిసి ఉండే సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని సంతోష్ తల్లిదండ్రులను సాయంత్రానికి అరెస్టు చేస్తామని మాధవి కుటుంబ సభ్యులు, ఇఫ్టూ కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ గెద్దం సంతోష్ ప్రేమ పేరుతో మాధవిని ఐదేళ్లుగా వంచించి మోసం చేశాడన్నారు. లుకరాజు, భార్య కుటుంబ సభ్యుల వ్యవహార శైలితో మనస్థాపానికి గురై మాధవి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సంతోష్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాధవి కుటుంబానికి హోం మంత్రి అనిత భరోసా కల్పించాలని కోరారు. జైల్లో ఉన్న సంతోష్‌ను చట్ట ప్రకారంగా శిక్షించాలని న్యాయమూర్తులను కోరారు. కార్యక్రమాలో తుంపాల మాధవి తల్లిదండ్రులు శివ నాగరాజు, కనకమహాలక్ష్మి, బంధువులు మౌనిక, ముత్యాల దుర్గాప్రసాద్, కోయల వరలక్ష్మి, సీత, భవాని, తలారి లక్ష్మి, తుంపాల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వికాసం



వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులకు బోధిస్తున్న రిసోర్స్‌పర్సన్‌లు



చెస్‌ఆడుతున్న విద్యార్థులు



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న జిల్లా డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు

- గ్రంథాలయాల్లో వేసవి తరగతులు
- అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన

దెందులూరు: వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయాలు శిక్షణ ఇస్తున్నాయి. వాటిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు దీనికి దోహదపడుతున్నాయి. ఆసక్తి నిరంతర సాధన, ఏకాగ్రతతో సాధించలేనిది ఏమీ ఉండదని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. శనివారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు జూనియర్ సీనియర్ విభాగాల్లో చదరంగం కోకో పోటీలు నిర్వహించారు. విద్యతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యత కేటాయించాలన్నారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగిసిన తర్వాత అధికారులు ప్రజాప్రతినిధులతో బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా 22 రోజైన శనివారం శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు కథలు వినడం, చెప్పడం, సామూహిక పుస్తక పఠనం, గణితంపై మెలకువలు తదితర అంశాలపై శిక్షణ పొందారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతల ద్వారా సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సుసాధ్యమవుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో తమ వంతు కృషి చేయాలన్నారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సామూహిక పుస్తకం పఠనం, వివిధ పోటీలు నిర్వహించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో పుస్తకం, పోటీలు జరిగాయి. అనంతరం చదరంగం, కబడ్డీ తదితర ఆడారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

పెదపాడు: గ్రంథాలయాల్లో చదివే పుస్తకాల ద్వారా విశేషమైన జ్ఞానం లభిస్తుందని పెదపాడు గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ప్రపంచంలోని ఏడు వింతలపై వారికి వివరణలతో విశదీకరించారు. అనంతరం గురుదక్షిణ అనే బాలల కథల పుస్తకం నుంచి అందని సహాయం అనే కథను చదివించడం కథలు చెప్పించారు. అనంతరం ఖోఖో ఆటను విద్యార్థులకు నేర్పించారు. ఈకార్యక్రమంలో స్థానికులు ఆరవల్లి రంగారావు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు నీతి కథలు వివరిస్తున్న రీసోర్స్ పర్సన్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలను తెలుసుకుంటే ఎంతో స్ఫూర్తినిస్తాయని రీసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారం 22వ రోజు కొనసాగాయి. ముందుగా చిన్నారులకు పుస్తక పఠనంలో రకరకాల నీతికథలను చదివించారు. రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధులు మహాత్మా గాంధీజీ 19 సంవత్సరాల వయస్సులోనే న్యాయశాస్త్ర విద్యాభ్యాసానికి ఇంగ్లాడ్ వెళ్లారని, ఆ సమయంలో కన్నతల్లికి ఇచ్చిన మాట ప్రకారం మాంసానికి, మద్యానికి దూరంగా ఉన్నారని వివరించారు. ఎంతో కష్టపడి స్వాతంత్య్రం మనకు అందించిన మహోన్నతమైన వ్యక్తిగా ఎదిగారని తెలిపారు. మరో వ్యక్తి అబ్రహం లింకన్ కూడా అతిపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కన్నతల్లికి ఇచ్చిన మాట ప్రకారంగా ఎన్నో కష్టాలను అనుభవించి అమెరికా దేశ అధ్యక్షుడయ్యారని, వీరు తల్లికిఇచ్చిన మాటప్రకారం ఆ స్థాయికి చేరుకోగలిగారని వివరించారు. రిసోర్స్ పర్సన్ పి.అనురాధ విద్యార్థులకు నీతికథలను బోధించారు. క్రమశిక్షణతోనే ఎదైనా సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.రమేష్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గ మృతికి సంతాపం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త మామిళ్ల దుర్గ ఇటీవల మృతి చెందింది. శనివారం ఏలూరులోని ఆమె స్వగృహానికి వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కిలాడి దుర్గారావు, భాస్కర్ల బాచి, జనార్ధన్, యర్రా రాంబాబు, ఇలియాస్ బా షా, సృజన్, కింజింగి రాజు, వెంకటేష్, మల్లిక్, బసవ, హేమకుమార్ తదితరులు ఉన్నారు.

అర్హత ఉన్న ప్రతి ముస్లింకూ పథకాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో ఏపీ రాష్ట్ర మైనార్టీల వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ శనివారం పాల్గొన్నారు. తొలుత రెవెన్యూ అతిథి గృహానికి చేరుకున్న షరీఫ్‌కు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా ముస్లింల సంక్షేమానికి అమలు చేస్తోన్న వివిధ కార్యక్రమాల అమలుపై అధికారులతో షరీఫ్ సమీక్షించారు. అర్హులైన ప్రతి ముస్లింకు సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై జిల్లాలోని వివిధ ముస్లిం సంఘాల నాయకులు అందించిన వినతి పత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని షరీఫ్ అధికారులను ఆదేశించారు. అనంతరం తంగెళ్లమూడి మర్కజ్ మసీద్‌కు వెళ్లి నమాజ్ చేశారు.అనంతరం ఏలూరు నుంచి తాడేపల్లి బయలుదేరి వెళ్లారు.

అనాథ బాలల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ



సదస్సులో మాట్లాడుతున్న బుల్లి కృష్ణ

ఏలూరు (టూటౌన్): బాలలంతా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సంబంధిత అధికారులతో అనాథ బాలలకు ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, న్యాయ సాధికారిత అనే అంశంపై స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో బుల్లి కృష్ణ మాట్లాడారు. జిల్లాలో అనాథ, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన, గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి వారికి గుర్తింపు కార్డు/ఆధార్ కార్డు మంజూరు చేయించాలన్నారు. ఈ ప్రక్రియకు న్యాయ, రెవెన్యూ, వైద్య శాఖలు, పానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో కమిటీ (సాథి) ఏర్పాటు చేశామన్నారు. అధికారులు న్యాయ సేవాధికార సంస్థ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియలో భాగం కావాలని సూచించారు.

నేడు తప్పిపోయిన పిల్లల దినోత్సవం

జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా ఆదివారం సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని బుల్లి కృష్ణ సూచించారు. ప్రస్తుత సమాజంలో బాలల అక్రమ రవాణా పెరిగిపోయిందని, దీనిని అరికట్టడానికి జిల్లా న్యాయశాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఏలూరు జిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి పి.శారద, ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, పశ్చిమగోదావరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.